క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే నిరసన కార్యక్రమం

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏపీ రాష్ట్ర పేద అక్కచెల్లెమ్మలకు ఇచ్చిన ఇంటి స్థలాలను శ్మశానవాటికతో పోలుస్తూ మాట్లాడిన చంద్రబాబునాయుడు వ్యాఖ్యలను ఖండిస్తూ శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు నిరసన కార్యక్రమం చేయనున్నారు. ఆదివారం ఉదయం 9గంటలకు పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్ వద్ద కార్యక్రమం జరగనుంది. కార్యక్రమానికి పట్టణ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులు కోరారు.

వీధిలైట్లు ఏర్పాటు


వీధిలైట్లు వేయిస్తున్న పంచాయతీ సిబ్బంది

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలోని జగనన్న కాలనీకి వెళ్లేదారిలో పంచాయతీ అధికారులు శనివారం విద్యుత్ స్తంభాలకు వీధిలైట్లను అమర్చారు. కేటీరోడ్డు నుంచి జగనన్న కాలనీకి వెళ్లడానికి వీధి లైట్లు లేక కాలనీవాసులు రాత్రివేళ ఇబ్బంది పడేవారు. ప్రజల సమస్యను గుర్తించిన గ్రామ కార్యదర్శి సుబ్బారావు వీధిలైట్లను ఏర్పాటు చేయించడంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

స్టీల్ గ్లాసుల పంపిణీ


ఉపాధ్యాయుడికి స్టీల్‌గ్లాసులను పంపిణీ చేస్తున్న ఎంఈఓ రవీంద్రనాథ్

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు రాగిజావ తాగడం కోసం జగనన్న విద్యాకానుకలో శనివారం ఎంఈఓ రవీంద్రనాథ్ స్థానిక ఎంఆర్‌సీలో ఉపాధ్యాయులకు స్టీల్‌గ్లాసులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న గోరుముద్దలో విద్యార్థులకు పౌష్టికాహారం అందించడం కోసం ప్రవేశపెట్టిన రాగిజావ తాగడం కోసం 3,457 మంది విద్యార్థులకు స్టీల్‌గ్లాసులను పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

23న బంగారమ్మ జాతర

తొట్టంబేడు(రేణిగుంట): శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానానికి అనుబంధంగా ఉన్న శ్రీబంగారమ్మ ఆలయంలో ఈనెల 23, 24వ తేదీల్లో జాతర నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. 23న ఉదయం అభిషేకం, గెరిగ పూజ, అంబళ్లు, 10 గంటలకు మైలుముగ్గు, మధ్యాహ్నం పోతురాజుముగ్గు, 4 గంటలకు పొంగళ్ల సమర్పణ ఉంటుందన్నారు. అలాగే 24వ తేదీ ఉదయం అభిషేకం, అలంకారం, విశేష పూజలు, అమ్మవారి ముగ్గు, సాయంత్రం కుంభం, బంగారమ్మ ఊరేగింపు, నిమజ్జనం కార్యక్రమాలు జరగనున్నాయి. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూధన్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో కూలీ మృతి

ఏర్పేడు: మండలంలోని ఆమందూరు బీసీ కాలనీకి చెందిన కూలీ అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి శనివారం రాత్రి తెలిపారు. సీఐ వివరాల మేరకు.. ఆమందూరు బీసీ కాలనీకి చెందిన మురుగేష్ (46) ఐఐటీ తిరుపతి క్యాంపస్‌లో కూలీ పనులు చేసుకునేందుకు ఈనెల 16న వెళ్లాడు. అక్కడే మూడు రోజుల పాటు కూలీ పనులు చేశాడు. ఈక్రమంలో మురుగేష్ భార్య అన్నెమ్మకు ఈనెల 19న భర్త కుప్పకూలి పడిపోయాడని అక్కడే పనిచేస్తున్న ఆమె తమ్ముడు దేవరాజ్ ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. వెంటనే ఐఐటీ అంబులెన్స్‌లో తిరుపతి రుయాకు తరలించగా అక్కడ వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు నిర్ధారించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నేడు ఎయిడ్స్‌పై క్యాండిల్ లైట్ ర్యాలీ

తిరుపతి అర్బన్: జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు ఎయిడ్స్, హెచ్ఐవీపై క్యాండిల్ లైట్ ర్యాలీ నిర్వహించనున్నట్టు జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ అధికారిణి అరుణ సులోచనదేవి తెలిపారు. ర్యాలీ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం నుంచి ప్రారంభమవుతుందని, రామకృష్ణ డీలక్స్ సర్కిల్ వద్ద మానవహారం ఏర్పాటుచేస్తామన్నారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ, నివారణ చర్యల్లో భాగంగా ప్రతి ఏటా ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవంగా డిసెంబర్ ఒకటిన, అంతర్జాతీయ క్యాండిల్ లైట్ మెమోరియల్ డేగా మే నెల మూడో ఆదివారం నిర్వహిస్తున్నట్టు వివరించారు.

రేపు అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం

తిరుపతి మంగళం : అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం -2023ను సందర్భంగా సోమవారం ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ ఆడిటోరియంలో రాష్ట్ర స్థాయి కార్యక్రమం నిర్వహించనున్నట్లు రాష్ట్ర జీవ వైవిధ్య మండలి సెక్రటరీ కె.గోపీనాథ్ తెలిపారు. ఇందులో ముఖ్య అతిథిగా మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కె.నారాయణస్వామి, ఆర్.కే.రోజా, స్పెషల్ చీఫ్ సెక్రటరీ నీరబ్ కుమార్ ప్రసాద్, రాష్ట్ర అటవీ దళాధిపతి మధుసూదన రెడ్డి, జీవ వైద్య మండలి చైర్మన్ బి.ఎం.కె రెడ్డి, ఎమ్మెల్యేలు పాల్గొంటారని పేర్కొన్నారు.

సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికీ లబ్ధి

- ప్రతి కుటుంబం ఆర్థికంగా బలపడేలా పథకాలు అందిస్తున్నాం
- 2024 ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోండి
- వలంటీర్ల సేవలు అభినందనీయం
- సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం


వలంటీర్లకు ప్రశంసాపత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం, పార్టీ శ్రేణులు

కేవీబీపురం: రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు చారిత్రాత్మకమని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. మండలంలోని పవనివారి కండ్రిగ సచివాలయ పరిధిలోని బైరాజీకండ్రిగ గ్రామంలో శనివారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రభుత్వ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధికి సంబంధించిన బుక్‌లెట్‌ను అందించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక ప్రజలతో మాట్లాడారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగనన్న తీసుకున్న నిర్ణయాలు, అమలు చేస్తున్న పథకాలతో ప్రతి కుటుంబం ఆర్థిక ప్రగతిని సాధించిందన్నారు.

ప్రతిష్టాత్మకంగా తీసుకోండి

అనంతరం ఎమ్మెల్యే ఆదిమూలం స్థానిక పార్టీ నాయకులు కార్యకర్తలతో సమావేశమయ్యారు.


బుక్‌లెట్‌ల ద్వారా సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సంక్షేమానికి కట్టుబడి పని చేస్తోందన్న విషయాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు గుర్తించాలన్నారు. వచ్చే 2024 ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని, గృహసారథులు, పార్టీ కార్యకర్తలు విధిగా ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రతి ఒక్కరూ పార్టీ తీసుకునే నిర్ణయాలకు కట్టుబడి ఉండాలన్నారు.

వలంటీర్లకు సత్కారం..

పనితీరులో విధేయతను కనబరిచి ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్న గ్రామ సచివాలయ వలంటీర్లను ఎమ్మెల్యే ఆదిమూలం శాలువాలతో సన్మానించి ప్రశంసా పత్రాలను అందించారు. వలంటీర్లు ప్రభుత్వానికి వారధిగా ఉంటూ తమకు కేటాయించిన ఇళ్లలో వారి కుటుంబ సభ్యులుగా మెలుగుతున్నారని తెలిపారు. మూడేళ్లుగా ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడంలో వలంటీర్ల సేవలు ఎనలేనివన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గవర్ల కృష్ణయ్య, ఎంపీపీ మునిలక్ష్మి, జెడ్పీటీసీ మునెమ్మ, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు బొర్రా మాధవిరెడ్డి, నేతలు నందకుమార్, లాల్ బాబుయాదవ్, సుబ్రమణ్యంరెడ్డి, సురేష్‌రెడ్డి, కల్యాణ్, సర్పంచ్ విజయ్, ఎంపీటీసీ జ్యోతి, ఎంపీడీఓ రామచంద్ర, తహసీల్దార్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలను పరిష్కరించండి


మాట్లాడుతున్న తహసీల్దారు శ్రీదేవి

సత్యవేడు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని తహసీల్దారు శ్రీదేవి ఆదేశించారు. శనివారం రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌ఓలతో ఆమె ప్రత్యేకంగా సమీక్షించారు. పనిరోజుల్లో వీఆర్‌ఓలు సచివాలయాల్లో ఉండాలని కోరారు. రోజు 3 నుంచి 5 వరకు నిర్వహించే స్పందన కార్యక్రమంలో తప్పక పాల్గొనాలని సూచించారు. అక్రమ మైనింగ్‌పై ఎప్పటికప్పుడు తహసీల్దారుకు సమాచారం అందించాలన్నారు. క్వారీల్లో అనుమతి ఒకచోట తవ్వకాలు మరోచోట జరుగుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిని పరిశీలించాలని ఆదేశించారు. ఇంటి స్థలాలు పొజిషన్ పత్రాలు మంజూరుకు సంబంధించి హౌసింగ్ అధికారులు గుర్తించిన జాబితాను అందజేయాలన్నారు. జనన, మరణాలు సర్టిఫికెట్లు పరిశీలించి ఇవ్వాలన్నారు. కోర్టు కేసులకు సంబంధించి త్వరితగతిన సర్టిఫికెట్లు అందజేయాలని కోరారు. కౌలురైతులు వివరాలు సేకరించాలన్నారు. కార్యక్రమంలో డీటీ వెంకటేశ్వర్లు, వీఆర్‌ఓలు ఇళయరాజా, భార్గవ్, నాగార్జున, శేఖర్, మధు, విక్రాంత్, రమేష్, సురేష్, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఊంజల్‌సేవ


ప్రత్యేక అలంకరణలో ప్రసన్న వేంకటేశ్వరుడు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలోని శ్రీప్రసన్న వేంకటేశ్వస్వామికి శనివారం ఊరేగింపు, ఊంజల్‌సేవను ఘనంగా నిర్వహించారు. శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి విగ్రహానికి అభిషేకాలు చేసి, పూలతో అలంకరించి ప్రత్యేకపూజలు చేశారు. శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవి ఉత్సవమూర్తులను పూలతో అలంకరించి పూజలు భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. అనంతరం భక్తులు దీపాలు వెలిగించి, కర్పూర హారతులతో ఊంజల్‌సేవ నిర్వహించారు. ఆవులకు పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

యువనేస్తం సేవలు హర్షణీయం


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

ఏర్పేడు: యువనేస్తం అసోసియేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాలు హర్షణీయమని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం అన్నారు. శనివారం తిరుపతిలో యువనేస్తం అసోసియేషన్ మూడో వార్షిక కరపత్రాలను ఆవిష్కరించారు. ఏర్పేడు మండలం పాతవీరాపురం గ్రామానికి చెందిన మునిశేఖర్ యువనేస్తం అసోసియేషన్‌ను స్థాపించి పలు సేవా కార్యక్రమాలు చేసినట్లు వివరించారు. పేదల అభ్యున్నతికి దాతలు ముందుకు రావాలని కోరారు. అసోసియేషన్ ప్రతినిధులు జస్వంత్, మునెమ్మ, నాగమణి, ప్రభాకర్ పాల్గొన్నారు.

మహిళల స్వయం సమృద్ధికి విరివిగా అవకాశాలు


సమావేశంలో మాట్లాడుతున్న మెప్మా పీడీ రాధమ్మ

రేణిగుంట: స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా ప్రభుత్వం అనేక స్వయం ఉపాధి అవకాశాలను కల్పిస్తోందని మెప్మా పీడీ ఏ.రాధమ్మ అన్నారు. శ్రీకాళహస్తి మున్సిపాలిటీ పరిధిలోని మెప్మా కార్యాలయంలో శనివారం మెప్మా సిబ్బందితో సమావేశం నిర్వహించారు. స్వయం ఉపాధి పథకాలపై సమీక్షించారు. అర్బన్ మార్ట్, ఫిషరీస్ యూనిట్ల ఏర్పాటు, ఆస్పత్రుల్లో ఆహా క్యాంటీన్ల ఏర్పాటు, టిడ్కో రుణాలు, స్ట్రీట్ వెండర్స్ సోషియో ఎకనమిక్ సర్వే, జగనన్న నగర్‌లో ఇళ్ల నిర్మాణాలకు రూ.35 వేల చొప్పున అదనపు రుణాలు వంటి అంశాలపై టార్గెట్లు, ఇప్పటి వరకు సాధించిన పురోగతిపై సమీక్ష జరిపారు. ఈ నెలాఖరుకల్లా నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలు అవకాశాలను అందిపుచ్చుకుని ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది వెంకట రమణ, జయరాం, ప్రసాద్, కావమ్మ, అమ్మాజీ, అజీజ్ ఉన్నీషా తదితరులు పాల్గొన్నారు.

సన్మానం


జయగోపాల్‌కు జ్ఞాపిక అందిస్తున్న ఎమ్మెల్యే

రేణిగుంట: శ్రీకాళహస్తి దేవస్థానం మాజీ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు చిట్టివేలు జయగోపాల్‌ను ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సన్మానించి జ్ఞాపికను అందజేశారు. జయగోపాల్ జన్మదినం సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే సమక్షంలో కేకు కత్తిరించారు.

అన్నదానం


శ్రీకాళహస్తిలో అన్నదానం చేస్తున్న అభిమానులు

తొట్టంబేడు(రేణిగుంట): సినీనటుడు జూనియర్ ఎన్టీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని శ్రీకాళహస్తి, తొట్టంబేడులో ఆయన అభిమానులు అన్నదానం చేశారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఆయా కార్యక్రమాల్లో ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ నాయకులు నాగమల్లి దుర్గాప్రసాద్, మధురెడ్డి, వంకాయల సిద్దులయ్య, హరిబాబు, చైతన్యరెడ్డి, మునికృష్ణ, రాకేష్, భరత్, రాజేష్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

కృష్ణయ్యకు సాదర స్వాగతం


స్వాగతం పలుకుతున్న బీసీ సంఘం నాయకులు

రేణిగుంట: తిరుపతిలో జరగనున్న బీసీ సభలో పాల్గొనేందుకు శనివారం రాత్రి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న రాజ్యసభ సభ్యుడు, బీసీ సంఘం నేత ఆర్.కృష్ణయ్య, రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ నారాయణలకు బీసీ సంఘం నాయకులు సాదర స్వాగతం పలికారు. రేణిగుంట మండలం గాజులమండ్యం, కృష్ణాపురం సర్పంచ్‌లు గంగారి రమేష్, ముద్దురాయులు వారికి స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

నూతన రథం ఏర్పాటుకు విరాళాల అందజేత


చేనేత సంఘం సభ్యులకు నగదును అందజేస్తున్న దాతలు

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయానికి నూతన రథం ఏర్పాటుకు శనివారం విరాళాలు అందినట్లు చేనేత సంఘం చైర్మన్ తంబా సుబ్రమణ్యం, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు చంద్రశేఖర్ తెలిపారు. పాపానాయుడుపేట సర్పంచ్ లలితా కరుణాకరన్ రూ.1.16 లక్షలు, సోనీ ఎరిక్సన్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ దగ్గోలు రమేష్‌రెడ్డి రూ.50 వేలు, ఎంఎస్ ప్రకాష్ రూ. 25 వేలు, ఎన్ఆర్ఐ మునిగంగాధర్ రూ.20 వేలు, ముదిరాజ్ సంఘం రాష్ట్ర కార్యదర్శి జయశంకర్ రూ.15 వేలు చేనేత సంఘం సభ్యులకు అందజేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోవిందస్వామి, చేనేత సంఘం సభ్యులు అన్నామలై మొదలి, ఎంసీబాబు, ఏలుమలై, దండరాజు, ముత్తుకుమార్, చంద్ర, రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి


ఎండీపుత్తూరులో తల్లిదండ్రులకు సూచనలిస్తున్న మోహనప్రియ

ఏర్పేడు: బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని సర్పంచ్ మోహనప్రియ అన్నారు. శనివారం మండలంలోని ఎండీపుత్తూరు పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో బడిఈడు పిల్లల గుర్తింపు కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ బడిఈడు పిల్లలను వచ్చే విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ఉన్నట్లు వివరించారు. ఉచితంగా విద్యాసామగ్రి అందజేస్తున్నట్లు చెప్పారు. అలాగే పోతుమానిగుంట ఎస్టీ కాలనీలో ప్రగతి సంస్థ మండల కన్వీనర్ శిరీష ఆధ్వర్యంలో బడిఈడు పిల్లల గుర్తింపు కార్యక్రమం జరిగింది.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించండి


వెస్టువరత్తూరులో బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని కోరుతున్న హెచ్ఎం రాజశేఖర్

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నెలవాయి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు శనివారం బడి ఈడు పిల్లలను చేర్పించాలని హెచ్ఎం రాజశేఖర్ తెలిపారు. పాఠశాల పరిధిలోని వెస్టువరత్తూరు, కారణి, వేణుగోపాలపురం, కమ్మవారికండ్రిగ గ్రామాల్లో బడిఈడు, బడి బయట, పిల్లల కోసం వారి ఇళ్ల వద్దకు వెళ్లి మీ పిల్లలను పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కారు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడమే కాక బడి బయట పిల్లలను గుర్తించి, వారిని పాఠశాలల్లో చేర్పించే విధంగా తల్లిదండ్రులను చైతన్య పరుస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ స్కూళ్లలో నాణ్యమైన విద్యతో పాటు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, బెల్ట్, నోట్‌బుక్స్, డిక్షనరీ, బూట్లు, సాక్సులు అందిస్తామన్నారు. అలాగే రుచికరమైన పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. పది పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల మార్కుల మెమోలను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

పది ప్రతిభావంతులకు సన్మానం



ప్రతిభావంతులు, తల్లిదండ్రులతో శ్రీనివాసులు

ఏర్పేడు: బాగా చదివితే సమాజంలో ఉన్నత స్థాయితోపాటు పేదరికాన్ని నిర్మూలించవచ్చని ప్రజా ప్రగతి ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. శనివారం స్థానిక ఎమ్మార్సీలో పది పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులు, తల్లిదండ్రులను సన్మానించి బహుమతులు అందజేసే కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ బండారుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పది పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణతను సాధించినట్లు వివరించారు. బండారుపల్లి ఎస్సీ కాలనీకి చెందిన హేమలత మండలలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అలాగే మునగలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన హాసిని, ఏర్పేడుకు చెందిన దీపిక అత్యధిక మార్కులు సాధించినట్లు వెల్లడించారు. ప్రజా ప్రగతి ట్రస్ట్ కో–ఆర్డినేటర్లు సుస్మిత, చంద్రశేఖర్, శ్రీనివాసులునాయుడు, సీఆర్పీలు వెంకటముని, మునీశ్వర్ పాల్గొన్నారు.

జగనన్న ఆణిముత్యంకు సుసీర్ణ ఎంపిక


సుసీర్ణ

వరదయ్యపాళెం: నియోజకవర్గస్థాయిలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివి టాపర్‌గా నిలిచిన వరదయ్యపాళెం జూనియర్ కళాశాల ఆర్ట్స్ గ్రూపు విద్యార్థిని ఇ.సుసీర్ణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆణిముత్యం కార్యక్రమానికి ఎంపికైంది. మండలంలోని ఎంజీనగర్‌కు చెందిన సుసీర్ణ సీఈసీ పూర్తి చేసింది. ఇటీవల వెలువడిన ద్వితీయ సంవత్సరం ఇంటర్ ఫలితాల్లో 837 మార్కులు సాధించి నియోజకవర్గ టాపర్‌గా నిలిచింది. ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులను ప్రోత్సహించేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆణిముత్యం కార్యక్రమం ద్వారా విద్యార్థినికి నగదు బహుమతిగా రూ.15 వేలు అందించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ పద్మావతి తెలిపారు. సత్యవేడు నియోజకవర్గం నుంచి జగనన్న ఆణిముత్యం పథకానికి వరదయ్యపాళెం జూనియర్ కళాశాల విద్యార్థిని ఎంపిక కావడంపై ప్రిన్సిపల్, అధ్యాపక బృందం హర్షం వ్యక్తం చేశారు.

తూనికలు, కొలతల్లో మోసాలకు పాల్పడితే చర్యలు


మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వర్

తిరుపతి అర్బన్: వ్యాపారులు తూనికలు, కొలతల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వర్ తెలిపారు. తిరుపతి నగరంలోని విశ్వం స్కూల్‌లో శనివారం వినియోగదారుల సమాచార కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ తూనికలు, కొలతల దినోత్సవం సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చట్టం ప్రకారం మోసం చేసినా, అధిక ధరలకు వస్తువులు విక్రయించినా వ్యాపారికి జరిమానాతోపాటు జైలు శిక్ష ఉంటుందని వివరించారు. మోసాలకు సంబంధించిన ఫిర్యాదులను టోల్ ఫ్రీ నెంబర్ 18004254202కు చేయాలని సూచించారు. జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షుడు పి.రాజారెడ్డి మాట్లాడుతూ వినియోగదారుల హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో విశ్వం స్కూల్ కరస్పాండెంట్ విశ్వచందన్, జిల్లా వినియోగదారుల సంఘం జిల్లా కార్యదర్శి ఎం.శ్రీనివాసులు, దేవేంద్ర, సబితా తదితరులు పాల్గొన్నారు.

మహా సంప్రోక్షణకు శాస్త్రోక్తంగా అంకురార్పణ


విష్వక్సేనులను ఊరేగిస్తున్న అర్చకులు, ఆలయ అధికారులు

తిరుపతి కల్చరల్: గోవిందరాజస్వామి ఆలయంలో ఆదివారం నుంచి 25వ తేదీ వరకు చేపట్టనున్న మహా సంప్రోక్షణ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా శనివారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ చేపట్టారు. ఉదయం 7.30 నుంచి 9 గంటల వరకు ఆచార్య రుత్విక్ వరణం నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటలకు శ్రీవిష్వక్సేనులను ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగించారు. అనంతరం మృత్సంగ్రహణం, వైఖానస ఆగమోక్తంగా అంకురార్పణ చేపట్టారు. గోవిందరాజ స్వామి ఆలయ విమాన గోపురం బంగారు తాపడం పనులు పూర్తి కావడంతో జీర్ణోద్ధరణ, మహాసంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో శాంతి, ఏఈవో రవికుమార్, ప్రధాన అర్చకుడు శ్రీనివాస దీక్షితులు, సూపరింటెండెంట్ నారాయణ, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ పాల్గొన్నారు.


మహాసంప్రోక్షణంలో అంకురార్పణ చేస్తున్న వేద పండితులు

ఆకట్టుకున్న కోలాటం


వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న కోలాటం కళాకారులు


కోలాటం ఆడుతున్న కళాకారులు

సత్యవేడు: శ్రీసిటీ పరిసర ప్రాంతంలో సంప్రదాయ జానపద కళారూపాలను ప్రోత్సహించేందుకు శ్రీసిటీలోని ఆధ్యాత్మిక, సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో 'కోలాటం' గ్రామీణ జానపద నృత్య రూపకాన్ని శనివారం స్థానిక శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి మందిర ప్రాంగణం వద్ద నిర్వహించారు. ఆరూరు గ్రామ కళాకారుల కోలాట ప్రదర్శనను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దఎత్తున తరలివచ్చారు. సంప్రదాయ దుస్తుల్లో నృత్యకారులు ఉత్సాహభరిత ప్రదర్శన అందరినీ అలరించింది. కోలాటం ప్రారంభానికి ముందు ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, శ్రీ విష్ణుసహస్ర నామ పారాయణంలో భక్తులు పాల్గొన్నారు. ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిన ఆ ప్రదేశం సామూహిక భగవన్నామ స్మరణతో మార్మోగింది. కార్యక్రమంలో శ్రీసిటీలోని గ్రామాల ప్రజలు పాల్గొనడం పట్ల శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్రసన్నారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. కోలాటం బృందానికి శ్రీసిటీ అకౌంట్ విభాగాధిపతి ఆర్.జనార్దన్‌రెడి ప్రతిభ కనభరిచిన వారికి నగదు పురస్కారం అందజేశారు. శ్రీసిటీ ప్రతినిధులు మధురెడి పీఎస్‌బీ శాస్త్రి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.


ప్రతిభ చూపిన కళాకారులకు ప్రోత్సాహక బహుమతి అందిస్తున్న జనార్దన్‌రెడ్డి